గడప గడపకు నిధులతో గ్రామాలాభివృద్ధి

విశాలాంధ్ర-పలాస: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గడప గడపకు నిధులతో గ్రామాలాభివృద్ధి చేస్తున్నామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) అన్నారు. మండలంలో బంటుకొత్తూరు పంచాయతీలో ఆయన పర్యటించి సమస్యలపై ఆరా తీశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, కాలువ పనులు చేపట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలో చాలా పంచాయతీల్లో రోడ్లు, కాలువలు, మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తక్షణమే మంజూరు చేసి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట షన్ముకరావు, ఎ.రామారావు, శారదరావు, బమ్మిడి భరతడు, దాలమ్మ, చిలకమ్మ, నాగేంద్ర పాత్రో, బగాతి రామారావు, సల్ల కామరాజు, గరికి ధర్మారావు, పొందర పూర్ణచంద్రలు పాల్గొన్నారు.

షీప్ అండ్ గోట్ సొసైటీ కోఆపరేటివ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా రాపాక

విశాలాంధ్ర-పలాస : షీప్ అండ్ గోట్ సొసైటీ కోఆపరేటివ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా రాపాక చిన్నారావు యాదవ్ నియమిస్తూ ఎ.పి యానిమల్ హస్బండ్రి డిపార్ట్‌మెంట్ తరుపున రాష్ట్ర ప్రభుత్వ ఉత్వర్వులు జారీ చేసింది. మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నారావు మంత్రి హయాంలో ఉద్దాన ప్రాంతాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అధికార వైసీపీ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ గుర్తింపు పొందిన నాయకుడిగా సేవలు అందిస్తున్నారు. జిల్లా యాదవ కుల సంక్షేమం అభివృద్ధి కోసం అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రస్తుతం సేవ చేస్తున్నారు. ఇది వరకు పలాస జెడ్‌పిటిసిగా పోటీ చేసిన అనుభవం ఉంది. బొడ్డపాడు కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులుగా పని చేశారు. ఈయన నియామకంపై ఉద్దాన ప్రాంత, జిల్లా యాదవులు అభినందనలు తెలిపారు.

గణిత దీప్తి పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గణిత దీప్తి పుస్తకాలు ను ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య విద్యార్థులు కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న లక్ష్మీకాంతము, నాగేశ్వరరావు గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో రూపొందించిన "గణిత దీప్తి" 50 రూపాయల విలువ చేసిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను 84మంది 10 వ తరగతి విద్యార్థులకు అందించటం పట్ల, ఇద్దరు ఉపాధ్యాయు లను కొనియాడారు. ఈపుస్తకాలు చాలా విలువైనవని, ప్రతీ విద్యార్థి అర్థం చేసుకొనే రీతిలో స్వయం అభ్యసనకు అనుగుణంగా తయారు చేశారన్నారు. దీనిని విద్యార్థులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి వినియోగించుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, వీరభద్రరావు, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, క్రిష్ణవేణి, సీఆర్పీ గిరి, రోజా, దయాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం వడ్డీతాండ్ర పంచాయతీలో అంగన్ వాడి కిట్లను మండల వైకాపా కన్వీనర్, ఎంపీటీసీ ప్రతినిధి కోత సతీష్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో సమయానికి సంబంధించిన టీచర్లు, ఆయాలు హాజరై బాలబాలికలకు తగిన విధంగా పోషక పదార్థాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీని నాయకులు కోత మధుసూదనరావు, అంగన్ వాడీ సూపర్ వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాస్మోటిక్, మెస్ చార్జీలను విడుదల చేయాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ వసతి గృహ విద్యార్థుల కాస్మోటిక్, మెస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పలాస పిడిఎస్‌యు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ 1071, ఎస్టీ 640, బిసి 1152, మైనార్టీ 118, సంక్షేమ వసతిగృహాల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరికి అందవల్సిన కాస్మోటిక్ చార్జీలు సుమారు 9నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు అందాల్సిన 26 రకాల వస్తువులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకలు రవి, విజయ్‌లు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బ్యాంకు మేనేజర్ గౌతమ్

విశాలాంధ్ర-కవిటి : ఏపీజీవీ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ ఇంటి గౌతమ్ మహిళా సంఘ సభ్యులకు, గ్రామస్తులకు సూచించారు. ఈ మేరకు బుధవారం బెజ్జిపుట్టుగ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఎస్పి నారాయణ స్వామి అధ్యక్షతన ఏపీజీవీ బ్యాంక్ సేవలపై ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ ఇంటి గౌతమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు.తమ శాఖలో పొదుపు పథకాలు,రుణాలు,డిజిటల్ లిటరసీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే ప్రయోజనం కలుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రేడ్ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి అందరూ సమిష్టిగా పని చేయాలని జోన్ 1 ఆర్.జె.డి.సి.ఈఎస్. శోభారాణి అన్నారు. బుధవారం స్థానిక కళాశాలను విశాఖపట్టణం జి.డి.ఎస్ ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డి. అరుణపద్మ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ కె.సుధాలతో కలిసి సందర్శించారు. ఆ బృంధాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రబీన్ కుమార్ పాఢి ఘన స్వాగతం పలికారు. దస్త్రాలు, పరిసరాలు, అక్కడి వసతులను పరిశీలించిన బృంధం నాక్‌లో ఉత్తమ గ్రేడ్ సాధించేలా కృషి జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బారువ కళాశాల ప్రిన్సిపల్ రామక్రిష్ణ, అధ్యాపకులు సుశాంత్ జెన్నా, సంతోష్‌కుమార్, శివకుమార్, దుర్యోదన, తిరుపతి,నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష

విశాలాంధ్ర-పలాస: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా పలాస టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రజలను భయభ్రాంతులను చేసి సైకో పాలన సాగిస్తున్నారని, కనుక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రతిపక్షాలను అరెస్టు చేసే విషయంలో దూకుడుగా అధికార పార్టీ వెళ్తుందని దుయ్యబట్టారు. సిఐడి, పోలీసులు అధికారులను చేతిలో పెట్టుకొని అధికారులు తోలుబొమ్మలాడిస్తూ గొంతిత్తిన ప్రతి వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని, ప్రతి ఒక్కరిని హింసించారని జగన్ సైకోల ప్రవర్తిస్తున్నారని మండి పడ్డారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్, బి.నాగరాజు, గాలి క్రిష్టారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, వద్ది యాదగిరి, కె.సత్యం, మరడ దుర్యోధన, నర్సింహులు, శశిభూషణ్, భుజంగరావులు ఉన్నారు.

అర్హులందరికీ పెన్షన్ అందజేత : సర్పంచ్

విశాలాంధ్ర-కవిటి : పంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయడమే లక్ష్యమని సర్పంచ్ ఎస్ పి నారాయణస్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వైస్ ఎంపీపీ కర్రీ గోపయ్య తో కలిసి సర్పంచ్ నారాయణ స్వామి చేతుల మీదుగా కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నారి, సచివాలయ సిబ్బంది విజయ్, రమేష్, వైఎస్‌ఆర్సిపి నాయకులు ప్రవీణ్, కూర్మారావు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకాష్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-కవిటి: దివంగత బెందాళం ప్రకాష్ సేవలు మరువలేనవని ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామంలోని వాలీబాల్ క్రీడా మైదానం వద్ద నూతనంగా నిర్మాణం చేపట్టిన బెందాళం ప్రకాష్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నటుడుగా, కళాకారుడిగా, మంచి క్రీడాకారునిగా, నాటకాల దర్శకుడుగా ఉద్దాన ప్రాంతానికి సుపరిచితమైన వ్యక్తి ప్రకాష్ అని అన్నారు. ఆంధ్రాబ్యాంక్ డైరెక్టర్ గానూ తన విశేష సేవలందించారనీ అన్నారు. నటన పై ఉన్న మక్కువతో 1985వ సంవత్సరంలో డి మోహన్ జీ దర్శకత్వంలో శ్రీ కనక మహాలక్ష్మి మూవీస్ వారు నిర్మించిన సజీవ మూర్తులు చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ప్రకాష్ నటించారని అన్నారు. ఉద్దానం ముద్దుబిడ్డగా కవిటి మండలం అభివృద్ధికి ఎంతోగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల, ఎమ్మెల్యే అశోక్ సోదరి ఆషా, మాజీ జడ్పిటిసి సభ్యులు పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, ఎస్ వి రమణ, కొర్రాయి వాసుదేవ రావు, మణి చంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌల్లో, భీమారావు రౌల్లో, బార్ల చిన్నబాబు, రంగా రౌల్లో, బెందాళం తిరుమల రావు, పండి బలరామ్మూర్తి, పిరియా కృష్ణారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలయ్యే వరకు పోరాటం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తప్పుడు కేసులో ఇరికించారని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దే దింపే వరకు ప్రజలతో కలిసి పోరాటం సాగిస్తామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం లావేరు మండల పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన సామూహిక దీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నవ్యాంధ్రలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టిడిపి ప్రభుత్వం 2017 నుంచి 2019 వరకు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రెండున్నర లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చి 70 వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. చంద్రబాబు నాయుడుని విడుదల చేసే వరకు ప్రజల మద్దతు టిడిపి శ్రేణులు పోరాటం సాగిస్తాయని చెప్పారు ఈ కార్యక్రమంలో లావేరు మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ పార్టీ నేతలు పిన్నింటి మధుబాబు, రాజ పంతుల ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై ప్రత్యేక చర్యలు : విశాఖ సీఎండీ పృథ్వీరాజ్

విశాలాంధ్ర-పలాస : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని విశాఖపట్నం విద్యుత్ శాఖ సిఎండి ఐ. పృథ్వీరాజ్ తెలిపారు. బుధవారం పలాస విద్యుత్ శాఖ కార్యాలయాన్ని సందర్శించి విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో నిరంతరం విద్యుత్తు సరఫరాలో అంతరాయం వస్తుందనే ఫిర్యాదులు ఉన్నాయని, ఎందుకు ఈ సమస్య వస్తుందో తెలుసు కొనేందుకు ఈ ప్రాంతంలో పర్యటించేందుకు వచ్చామని తెలిపారు. ఉద్దానంలో చెట్ల కొమ్మల మధ్య నుంచి విద్యుత్తు లైన్లు సరఫరా అవుతుండటంతో ఇబ్బంది ఉండటంతో కండక్టర్ ద్వారా ఇబ్బంది లేకుండా చేయాలనే ఆలోచనతో చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త సబ్ స్టేషన్లతో పాటుగా ఇంటర్ కనెక్టింగ్ లైన్లు వేసేందుకు 11కె.వి.లైను, 302 కిలోమీటర్లు, కవిటి మండలంలో 33కెవి లైను 28 కిలోమీటర్ల మేర వేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా ఉద్యోగుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం కాశీబుగ్గ పద్మనాభ పురం సచివాలయాన్ని సందర్శించారు. విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం చేయాలని అందుకు సచివాలయం ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఆయనతోపాటు జిల్లా విద్యుత్ శాఖ ఎస్.ఇ ఎల్.దైవప్రసాద్, ఇ.ఇ.జి.ప్రసాద్, ఎస్.ఏ.ఓ.పి. తాతాచార్యులు, డి.ఇ.ఇ ఐ. కృష్ణమూర్తి, ఏ. ఇలు వివేకానంద, నాగభూషణ్, యోగి, గార రాజారావు, విద్యుత్తు ఉద్యోగులు,అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ, వడ్డీతాండ్ర, రంకుహనుమంతుపురం పంచాయతీ లలో ఆయా సర్పంచ్‌లు పిలక బృంద రవికుమార్, ఎన్ని మన్మధరావు, మండల వైకాపా కన్వీనర్ కోత సతీష్ కుమార్ చేతుల మీదుగా నూతనంగా మంజూరు అయిన పింఛన్లు లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పంచాయతీలకు చెందిన ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రుణాలు : ఏ.పి.ఎం.

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మండలంలో గల పంచ సూత్రాలు పాటిస్తూ 6 నెలలు పూర్తి చేసుకున్న అన్ని మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా బ్యాంకు రుణాలను మంజూరు చేయిస్తున్నట్లు వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధ వారం నెల్లివర్తి గ్రామంలో మహిళా రైతు సంఘాల పుస్తకాలను పరిశీలిస్తూ మాట్లా డారు. బ్యాంకు రుణాలను సక్రమముగా వినియోగించుకొని తిరిగి చెల్లిస్తూ, చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడం, పెరటి తోటల పెంపకం, ఆకుకూరలు కాయగూరల పెంపకం చేయాలని సూచించారు. మునగ, బొప్పాయి, జామ , కరివేపాకు తదితర మొక్కలను పెంచుతూ కుటుంబ అవసరాల పోను మిగతా ఉత్పత్తులను మార్కెట్ చేసుకుంటున్న అన్ని సంఘాలకు కూడా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ను మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో ఆహార ఉత్పత్తులను తయారు చేసి, మార్కెటింగ్ చేసుకుంటున్న వారికి సబ్సిడీ రుణాలను కూడా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు క్లస్టర్ కోఆర్డినేటర్లు సుభద్ర రామప్పతోపాటు వి.వో.ఏ.లు రమా , భారతి తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ గ్రీన్ సిటీ సేవలు అమూల్యం : ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అంధ కళాకారులకు నిత్యవసర సరుకులు అందజేయటం హర్షణీయమని ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. జెసిఐ గ్రీన్ సిటీ వారోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం బెహరా మనో వికాస కేంద్రంలో సుమారు 80 మంది పిల్లలకు స్నాక్స్, అంధకళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసిఐ గ్రీన్‌సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, సీనియర్ జర్నలిస్ట్ కొంక్యాన వేణుగోపాల్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సేవలకు చిరునామాగా శ్రీకాకుళం గ్రీన్‌సిటీ ఉందని, సంస్థ ప్రెసిడెంట్ మణిశర్మ, కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. కల్లేపల్లి ఉష ఈ సందర్భంగా సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలని ప్రెసిడెంట్ మణిశర్మ తెలిపారు. ఈసందర్భంగా బెహరా మనోవికాస నిర్వాహకులు బి.ఎస్.ఆర్.శేఖర్, శ్యామలాకుమారిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సెనేటర్ పొలిశెట్టి మధుబాబు, ఐపీపీ సాయిబాబా, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, లక్ష్మణ్, గణపతి, కళ్యాణ్, సింహాచలం, కుప్పిలి చిత్రలేఖన ఉపాధ్యాయులు ఉర్దంం రవితేజ్, చేయూత మేమున్నాము వారణాసి వెంకటలక్ష్మి, జాడ సాయి, సుప్రజా రౌత్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు పొడుగు చరణ్, జేసీఐ గ్రీన్ సిటీ సభ్యులు డాక్టర్ పైడి ప్రదీప్, జర్నలిస్ట్ ఉర్దంం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రోగ్రామర్స్ డే

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నగరంలోని ఎల్ ఐ కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్రోగ్రామర్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో ప్రోగ్రామర్స్ పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. ముఖ్యంగా ఐ టి రంగంలో వీరి పాత్ర చాలా ఎక్కువగా ఉందన్నారు. కావున కళాశాలలో అందించే కోడింగ్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనివలన కళాశాల వారు అందించే అత్యుత్తమ క్యాంపస్ కొలువులను సాధించవచ్చు అన్నారు. కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి ఎల్ ప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రోగ్రామర్ అనేది విద్యార్థి యొక్క తెలివితేటలను బయటపెడుతుందన్నారు. అదేవిధంగా ఈ మధ్య మన ఇస్రో నిర్వహించిన చంద్రయాన్, ఆదిత్య ఎల్ 1 మరియు ఇతర అంతరిక్ష రంగంలో ప్రోగ్రామర్స్ కీలకపాత్ర ఉందన్నారు. ప్రోగ్రామర్స్ డే సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ సీఎండి పృథ్వితేజ్ సందర్శన

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బొరివంక విద్యుత్ సబ్ స్టేషన్ ను విద్యుత్ శాఖ సి.ఎమ్.డి. పృధ్వితేజ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను సిఎండి పృధ్వితేజ్ అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్.ఈ.డి.ఈలు, ఏ.డి.లు కవిటి మండల ఏ.ఈ నేతాజీ స్థానిక లైన్‌మన్‌లు, విద్యుత్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు: మండలం గుమ్మపాడు సచివాలయం పరిధి కోదడ్డపనస, గడ్డిపేట, వండనవలస, కొత్తూరు గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మ ప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకే గడప గడప కు కార్యక్రమం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయాన్ని కృష్ణదాస్ సందర్శన

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు: మండలం కోదడ్డపనస గ్రామం కొండపైన స్వయంభువుగా వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయాన్ని బుధవారం వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్ దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదడ్డపనస గ్రామస్తులు ఆలయ అభివృద్ధి విషయమై చర్చించారు. మున్ముందు ఈ అయ్యప్ప దేవాలయం మరింత మహిమాన్వితమై అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, మునిసిపల్ కమీషనర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, డి.సి.హెచ్.ఎస్, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్లు, పంచాయతీ, ఐసిడిఎస్ అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జిల్లా నుండి కలెక్టర్,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సీఎంతో మాట్లాడుతూ తమరి ఆదేశాలతో వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు జిల్లాలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించడం మరియు అవగాహన పెంపొందించే లక్ష్యంతో గ్రామ ఆరోగ్య కేంద్రాలు మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను తెలుసుకోవడానికి అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో వైద్యుల నియామకం తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. బి.మీనాక్షి, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ ప్రకాశరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఐ.సి.డి.ఎస్ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మ్ యంత్రం పరికరం ప్రారంభం

- డా ఎల్ ప్రసన్నకుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: కార్మ్ కంప్యూటర్ అసిస్టెడ్ రేడియో మోనిటరింగ్ యంత్రం రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో డా ఎల్ ప్రసన్న కుమార్ ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా ఎముకలు ఎక్కడైనా విరిగితే ఈ మిషన్ ద్వారా కరెక్ట్ జాయింట్ ని పట్టుకొని ఆపరేషన్ చేసేందుకు వేసులుబాటు ఉంటుందన్నారు. ఈ పరికరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా. టి. శ్రీనివాసరావు, డా కె శ్రీనివాస రావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగు చెరుకు పంట క్షేత్రస్థాయి సందర్శన

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలం నిమ్మతొర్లువాడ గ్రామం లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న చెరుకు పంటలను మురగప్పన్ ఇ.ఐ.డి పారీ సుగర్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి మాట్లాడుతూ మా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ఎంతో ఆసక్తి తో సాగు చేస్తున్నరని అలాగే రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నమని అన్నారు. సుగర్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయంలో చెరుకుని ఎలా పండిస్తున్నారు అలాగే పంట దిగుబడి ఎంత వస్తుంది మరియు కలుపు నివారణ మొదలైన అంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వారు ప్రకృతి వ్యవసాయాన్ని చాలా బాగా చేస్తున్నరని అభినందించారు. ఈ కార్యక్రమంలో పారీ సుగర్ గ్రూప్ ప్రతినిధులు రాజేంద్రన్, కమల్ పట్నాయక్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నమ్మడు, జనార్ధన్, కృష్ణవేణి పాల్గొన్నారు.

నీలకంఠంకు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-పలాస : మండలం నీలావతి గ్రామంలో బుధవారం ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) గ్రంథాలయంలో సహోదర యువజన సంఘం, అండమాన్ అధ్యక్షులు కుత్తుం నీలకంఠంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ యువివి చేస్తున్న కార్యక్రమాలు చాలా గొప్పవని ఉద్దానంలో విద్య వ్యాప్తికి ఎంతో కృషి చేస్తుందని యువివి స్ఫూర్తితో తాను కూడా అండమాన్‌లో విద్య కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. గ్రంథాలయం విద్య నిలయంగా వికసించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయం నిర్వహణకు తగు సూచనలు చేసారు. గ్రంథాలయానికి 20 కుర్చీలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో యువివి అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, కార్యదర్శి బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాశరావు, జినగ సీతారాం, కుత్తుం సుధాకర్, తంగుడు ఖగేష్, యంపల్ల కామేశ్వరరావు, పుష్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాకివలస

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలంలోగల కురుడు పంచాయతీ పాకివలస గ్రామంలో డ్రేనేజీ, పారిశుద్ధ్య తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఈ గ్రామం ఎలాంటి మౌళిక సదుపాయాలకు నోచుకోకపోవడంతో గ్రామస్థులు నరక యాతన పడుతున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున బయటకు మురికినీరు వెళ్ళేందుకు వీలులేకపోవడంతో చిన్న చిన్న వర్షాలకు రోడ్డుపైకి నీరుచేరి ఇల్లులోకి వస్తుందని గ్రామస్థులు పాటు పలువురు వాపోతున్నారు. వర్షం నీరుతో పాటు మురికినీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో దోమలుతో నరక యాతన పడుతున్నామని అవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా మంగళవారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలకు రోడ్డుపైకి నీరు చేరడంతో రోడ్డు చెరువులను తలపిస్తుందన్నారు. అలాగే ఫ్లై ఓవర్ బ్రిడ్జి లోపల మరియు టెక్కలి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో ఇదివరకు ఎన్ హెచ్ 16 అధికారులు డ్రైనేజ్ మరియు కల్వర్టు నిర్మించారని, రోడ్లు విస్తీర్ణం జరిగిన తర్వాత అవి మూసుకుపోయాని దీంతో వర్షం పడితే పాకివలసకు రవాణా సౌకర్యం, ప్రజలకు నడిచే దారి కూడా లేక ఇబ్బందికి గురవుతున్నామన్నారు. కావున మండల ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరిస్తారని గ్రామస్థులు కోరుతున్నారు.

కోటి రూపాయల డిపాజిట్లు సేకరణ

డిసిసి బ్యాంక్ సిబ్బందిని అభినందించిన సిఇఓ

విశాలాంధ్ర-సోంపేట : డిసిసి బ్యాంక్ సోంపేట శాఖ గత మూడు నాలుగు రోజుల్లో కోటి రూపాయల డిపాజిట్లు సేకరించడం పట్ల జిల్లా కోపరేటివ్ బ్యాంక్ సీఈఓ డి.వరప్రసాద్ సిబ్బందిని అభినందించారు. సోంపేట బ్యాంకు వద్ద బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఈఓ చేతుల మీదుగా గొల్లగండికి చెందిన మర్లపోలమ్మ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి 40లక్షలు, పిఎంఇజిపి కింద తామాడ విశ్వనాధంకు 36లక్షలు, ఫిష్ ఆంధ్రా పథకం కింద 15.70లక్షలు, ఎఫ్‌పిజి గ్రూప్ 40లక్షల రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ వంద కోట్ల టర్నోవర్ చేరువలో ఉందని అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మురళీధర్, పిఎసిఎస్ అధ్యక్షుడు విశ్వనాధం, బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, ఈదుపురం బ్రాంచ్ మేనేజర్ హేమసుందర్, ఇచ్ఛాపురం బ్రాంచ్ మేనేజర్ తులసీబాయి, సోంపేట సీఈఓ నారాయణరావు, కంచిలి సీఈఓ రామారావు, కవిటి సీఈఓ జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ పేరుతో ప్రజలపై రూ.1500కోట్లు భారం ఉపసంహరించుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్

విశాలాంధ్ర-అరసవల్లి : రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు విద్యుత్‌శాఖ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో బుధవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే అధిక ధరలు, అదనపు భారాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వడ్డీ పేరుతో మళ్ళీ విద్యుత్ భారాలు వేయడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి విద్యుత్ ఛార్జీల పెంపు, స్లాబులు మార్చి భారాలు మోపడం, ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్సిడ్ చార్జీలు, విద్యుత్ సుంకం పెంచడం, సర్దుబాటు ఛార్జీల పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై వేశారని అన్నారు. బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని తెలిపారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా రూ.0.40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం దారుణమని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ 80 కేజీల జీడి పిక్కలు బస్తాకు 16 వేలు రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే ఆర్.బి.కేల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విస్తృత సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఆహ్వానించిన ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

కళాశాల ప్రిన్సిపల్ వైకుంఠరావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: విద్యార్థి దశనుండే విద్యార్థులు ప్రణాళిక యుతంగా ముందుకు సాగి, ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగి పది మందికి ఆదర్శంగా నిలవాలని ఎస్. డి.ఆర్.ఆర్.ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ తరగతి చదువులతో పాటుగా ఆట పాటలతో పాటు కాంపిటేటివ్ పరీక్షల్లో సైతం రాణించేలా భవిష్యత్తు ప్రణాళికలను నిర్దేశించుకొని పదిమందికి ఆదర్శంగా నిలవాలన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అత్యున్నత స్థాయికి ఎదగడానికి ఇది మొదటి మెట్టని, ప్రతి విద్యార్థి సమయం వృధా చేయకుండా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల స్థల దాత దుక్క మధుసూదన్ రెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భాష హిందీని నేర్చుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: జాతీయ భాష హిందీని అలక్ష్యం చేయకుండా అందరూ నేర్చుకొని జాతీయతాభావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాల పేట ప్రధానోపాధ్యాయురాలు జి.శాంతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా బుధవారం ముత్యాలపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హిందీ అక్షరం అ ఆకృతిలో విద్యార్థులచే హిందీ ఉపాధ్యాయులు సింహాచలం అంకుల ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మెర్రి గోపి, అనింగి నాగేశ్వర రావు, నెయ్యిల కృష్ణ, కింజరాపు రామకృష్ణ, అప్పలరాజు, నాగమణి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను పీడీ శాంతిశ్రీ తనిఖీ

విశాలాంధ్ర-శ్రీకాకుళంరూరల్ : అంగన్వాడీ కేంద్రాల సందర్శనలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం మరియు సాధికారత జిల్లా అధికారిని బి.శాంతిశ్రీ శ్రీకాకుళం రూరల్‌లోగల ఒప్పంగిలో గల ఒకటి, రెండు అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో తల్లులతో వారు తీసుకోవలసిన పోషకాహారం తల్లిపాలు యొక్క ఆవశ్యకత మరియు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఆయా కేంద్రాల నందు ఉన్న పౌష్టికాహార నిల్వలను తనిఖీ చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా బరువు తక్కువగా ఉన్న పిల్లల్ని సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

ఐప్వా 9వ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పలాస : ఢిల్లీలో ఈ నెల 30, అక్టోబర్ 01న జరగనున్న 9వ అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐప్వా జిల్లా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, వనజ, లక్ష్మి, గీతమ్మ, తులసమ్మ కోరారు.బుధవారం కాశీబుగ్గలో ఐప్వా జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కోనారి ఈశ్వరమ్మ మాట్లాడుతూ దేశానికి ఒలంపిక్ పతకాలు గెలిచిన మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ శరణసింగ్ బిజెపి యం.పి ను సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని తన పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయమని చెప్పినంత వరకు గుజరాత్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, ఇటువంటివారికి బిజెపి మద్దతు ఇవ్వడం దార్మణమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మహిళలపై చిత్రహింసలు రెట్టింపు స్థాయిలో పెరిగిపోతున్నాయన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేదన్నారు. మణిపూర్ సంఘటన మనం గుర్తు చేసుకుంటే మహిళలకు వివస్త్రను చేసి బట్టలు లేకుండా ఊరేగింపు చేయడాన్ని చూస్తే దేశం ఎటు పోతుందోనని అర్థం వ్యక్తం చేశారు. మహిళాలోకం ఎదుర్కొంటున్న అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా మహిళా సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న వంట గ్యాస్ , నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళా రక్షణ కు ప్రవేశ పెట్టిన చట్టాలన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలతో పాటు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడును తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర-పలాస: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు డిమాండ్ చేశారు. బుధవారం బొడ్డపాడులో చంద్రబాబును అతివేగంగా విడుదల కావాలని కోరుతూ చింతల పోలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డు దుశ్యంత్, నౌగాపు గంగాధర్, పోతనపల్లి తాతారావు, గర్తం శారద, మద్దిల వనిత, తామాడ మమత, రాజాం పద్మ, రెయ్యి హేమలత, కె.పుణ్యవతి, రాజాం శ్రీనివాస్, తామాడ రామయ్య, గర్తం కృష్ణమూర్తి, బొడ్డు శ్రీరాములు, గుజ్జు దుశ్యంత్, బొడ్డు జగన్, బచ్చల శంకర్‌లు పాల్గొన్నారు.

శ్రీ బుద్ధ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గార: శ్రీకాకుళం జిల్లా, కళింగ పట్టణం స్థానిక శ్రీ బుద్ధ పాఠశాలలో బుధవారం శ్రీ సాయి దంత కళాశాల రీసెర్చ్ వారి సహకారంతో, శ్రీ బుద్ధ యువ టూరిజం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలను నిర్వహించటం జరిగిందని, దంత సమస్య ఉన్న విద్యార్థులకు, తల్లిదండ్రుల సమ్మతితో ఉచిత పరీక్షలు చేస్తున్నామని, దంత సమస్యలున్న వారికి ఉచితంగా మందులను కూడా అందిస్తామని శ్రీ సాయి డెంటల్ కళాశాల వైద్యులు డా. ఒలివ. మార్గరీట తెలియజేశారు. విద్యార్థులకు దీర్ఘకాలిక దంత సమస్యలుంటే వారికి రవాణా సౌకర్యం కూడా ఉచితంగా ఇస్తూ, దంత కళాశాలలో అవసరమైన పరీక్షలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ బుడ్డా. లలిత, బుద్ధ స్కూల్ చైర్మన్ బుడ్డా యర్రన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాసపురాన్ని వ్యవసాయశాఖ సందర్శన

విశాలాంధ్ర-సోంపేట : జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు కలిసి తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న మండలంలోని ఒక గ్రామమైన పలాసపురాన్ని బుధవారం పరిశీలించారు. వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది వరినారుమళ్ళు ఎండిపోయిన పరిస్థితులను గమనించారు. వారు పరిసరాల్లో ఎక్కడ దమ్ములు, ఉభాలు కాని బీడు భూములను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తడకజోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి వెంకటరమణ, పలువురు రైతులు అధికారులకు తమ గోడు వినిపించారు. ప్రత్యామ్నాయ పంటల కోసం తమకు ప్రభుత్వం ద్వారా రాయితీ విత్తనాలు ఇప్పించాలని సర్పంచ్, ఎంపీటీసీ అధికారులను కోరారు. తప్పకుండా పరిశీలించి రైతులకు స్వల్ప కాలిక వంగడాలు సబ్సిడీపై అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ లలో వివిధ ట్రేడుల్లో మిగిలిన సీట్లను నాలుగో విడతలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎం సుధాకర్ రావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏ ఐటిఐలలో చేరాలను కుంటున్నారో ఆ ఐటిఐ కు ఈనెల 19వ తేదీలోగా ఐటిఐ డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాన్ని డౌన్లోడ్ చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ప్రభుత్వ ఐటిఐ లో ఈనెల 20వ తేదీలోగా పరిశీలన జరుపుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటిఐలో సీట్లకు ఈ కౌన్సిలింగ్ ఈనెల 22న ప్రైవేటు ఐటిఐ లలో కౌన్సిలింగ్ ఈనెల 23వ తేదీన జరుగుతుందని చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు

విశాలాంధ్ర-పలాస: వైసీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మజూరు చేయడం జరుగుతుందని వార్డు కౌన్సిలర్ల ప్రతినిధులు శిష్టి గోపి, అంబటి ఆనందరావు, బడగల బాల చంద్రుడు, రవిరమేష్‌లు అన్నారు. బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డులో 9 మందికి, 19వ వార్డులో 24 మందికి, 20వ వార్డులో 6 మందికి, 10వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బమ్మిడి సంతోష్‌కుమార్, వార్డు వెల్ఫేర్ కార్యదర్శి జి.విఘ్నేష్, సచివాలయం అడ్మిన్ సెక్రటరీ హెచ్.ధర్మారావు, ఎన్.భగీరధి, చిత్తరెడ్డి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. అలాగే మండలం బ్రాహ్మణతర్లాలో నూతనంగా మంజూరైన వైఎస్ఆర్ పింఛన్లు 30 మందికి సర్పంచ్ బాడన పుష్ప పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి తుంగాన రవణమ్మ, మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ, విఆర్‌వో సోమేశ్వరరావులు పాల్గొన్నారు.

అవినీతి చక్రవర్తి చంద్రబాబు

- దోచుకున్నారు కాబట్టే దొరికిపోయారు
- ప్రజాక్షేత్రంలో చంద్రబాబు పొరపాట్లు వెలుగు చూస్తున్నాయి
- ప్రజలు వాస్తవాలను తెలుసుకుంటున్నారు.... - వైసీపీ సీనియర్ నాయకులు డాక్టర్ ధానేటి శ్రీధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు పనిచేసి, 40 ఏళ్లు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, వ్యవస్థలను సైతం మేనేజ్ చేయడంలో ఎంతో స్కిల్ ఉండి స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అరెస్టు కావడం ఆశ్చర్యంగా ఉందని వైసీపీ సీనియర్ నాయకులు డాక్టర్ ధానేటి శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. అవినీతి చేయడం వాటిని మేనేజ్ చేసుకోవడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఎన్ని పాపాలు చేసినా ఏదో ఒకరోజు దొరికిపోవడం ఖాయమని చంద్రబాబు అరెస్టుతో రుజువైందన్నారు. దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు న్యాయవాదులు సైతం చంద్రబాబు అరెస్టు కాకుండా అడ్డుకోలేక పోయారంటే ఆయన ఏ విధంగా అవినీతికి పాల్పడ్డారో అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అరెస్టులతో చట్టం ముందు అందరూ సమానులే అన్న భావన ప్రజల్లో న్యాయస్థానం కల్పించిందని తెలిపారు. అనేక అవినీతి కేసుల్లో స్టేలు తెప్పించుకుని న్యాయస్థానాలను చంద్రబాబు మేనేజ్ చేస్తూ వస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు శిక్షణ అందించే స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ పేరిట రూ.370 కోట్ల మేర అవినీతి జరిగినట్టు సీఐడీ గుర్తించిందన్నారు. నిరుద్యోగులను నిట్టనిలువునా మోసం చేసిన చంద్రబాబుకు వారి ఉసురు తగిలి ఉంటుందని చెప్పారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు సుప్రీంకోర్టు న్యాయవాదులను తెప్పించుకున్నప్పటికీ చంద్రబాబు అరెస్టును తప్పించలేక పోయారన్నారు. చంద్రబాబు అరెస్టుతో న్యాయం గెలిచిందని ప్రజలే చెబుతున్నారని శ్రీధర్ పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని వారిని టీడీపీ నాయకులు ఏమార్చే ప్రయత్నం చేసినా అవి చెల్లడం లేదన్నారు. మొన్నటి బంద్‌కు వచ్చిన స్పందనే అందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు చేసిన తప్పు పట్ల పశ్చాత్తాపం పడడం లేదని చెప్పారు. చంద్రబాబు అరెస్టుతో న్యాయస్థానం దష్టిలో అందరూ సమానులే అన్న భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు. తప్పు చేస్తే సామాన్యుడైనా... మాజీ ముఖ్యమంత్రి అయినా శిక్ష తప్పదని బాబు అరెస్టుతో మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

సచివాలయాల వ్యవస్థతో సుపరిపాలన సాధ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెళియాపుట్టి : గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాలలో సుపరిపాలన సాధ్యమవుతుందని ఆ దశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సుపరిపాలన, ప్రజాసంక్షేమాన్ని అందిస్తున్నరని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో గోకర్ణపురం, కరజాడ, జోడూరులలో గ్రామ సచివాలయం, రైతుభరోసా, హెల్త్ వెల్నెస్ కేంద్రాలను బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ సచివాలయ, రైతుభరోసా వ్యవస్థల ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేస్తూ పరిపాలన సాగించడం జరుగుతుందని అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి చేపడుతున్న పథకాలు గూర్చి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు వాగ్దానాలు ఇచ్చి విస్మరించారని, అప్పట్లో చేసిన తప్పిదాలు, స్కాం లకు పాల్పడ్డారన్నారు. ముందుగా గొకర్ణపురం గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాతపట్నం సీఐ వినోదుబాబు ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రారంభించారు. తనకు సచివాలయ ప్రారంభోత్సవానికి ముందస్తుగా ఎటువంటి సమాచారం లేదంటూ గోకర్ణపురం సర్పంచ్ రవికుమార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యులు గూడ ఎండయ్య, ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, తహశీల్దారు సరోజిని, ఎంపిడిఓ చంద్రకుమారి, వ్యవసాయ అధికారి దానకర్ణుడు, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పల్లి యోగి, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో ఎన్నో అనార్థాలు : బ్రెడ్స్ ప్రతినిధి లోకనాథ్

విశాలాంధ్ర-కవిటి: బాల్యంలో వివాహాలు చేపట్టడం వల్ల ఎన్నో అనర్ధాలు నెలకొంటాయని బ్రెడ్స్ ప్రతినిధి లోకనాథ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కొజ్జీరియా గ్రామంలో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ,కె ఎస్ సి ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ నీల అధ్యక్షతన బాల్య వివాహాలు పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నీల, బ్రెడ్స్ ప్రతినిధి లోకనాథ్ మాట్లాడుతూ యుక్త వయసు రాక మునుపు అనగా బాల్య దశలో చేసే వివాహము చాలా అనర్థలకు దారితీస్తుందని అన్నారు. నేడు చట్ట ప్రకారము 18 సంవత్సరాల వయసు నిండని అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి జరిగే వివాహమును బాల్య వివాహముగా చెప్పవచ్చు అని వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాజేష్, ప్రధానోపాధ్యాయుడు జగనాథం, ఏఎన్ఎం జోగమ్మ, అంగన్వాడి వర్కర్ కే రామలక్ష్మి మహిళా పోలీస్ కే కోమలి, స్థానికులు పాల్గొన్నారు.

పారదర్శకత పాలనకు మారుపేరు జగన్ : మంత్రి డాక్టర్ సీదిరి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : పారదర్శక పాలనకు మారుపేరు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం మెట్టూరు, ఒంకులూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ ప్రతినిధి జోగ అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ జగన్ మాట ఇచ్చారు అంటే అమలు చేస్తారు అంతే అని నిరూపించుకున్నారు అన్నారు. చంద్రబాబు మాట మీద నిలబడే వ్యక్తి కాదన్నారు. 2014 లో అధికారంలోకి రావడానికి హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయకుండా అందరినీ మోసం చేసారు అన్నారు. అప్పుడు చేసిన తప్పులకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నాడు అన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ స్కాంలో రూ. 371 కోట్లు అవినీతి చేసి రాజమండ్రి సెంట్రల్ జైలు లో ఊచలు లెక్కపెడుతున్నారని అన్నారు. తప్పు చేస్తే చంద్రబాబు నే వాళ్ల బాబునైనా అరెస్ట్ చేస్తామని అన్నారు. సిఎం జగన్ ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పర్చడానికి ప్రజాధనం బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలకు డబ్బు జమ చేస్తున్నారు అన్నారు. అదే చంద్రబాబు ప్రజాధనం లూటీ చేసి సొంత ఆస్తులు కూడగట్టుకున్నారు అన్నారు. రాజకీయాల్లోకి 2 ఎకరాల ఆసామిగా వచ్చి ఇప్పుడు రెండు లక్షల కోట్ల కు అధిపతి అయ్యారని ఆరోపించారు. అవినీతి చేయకపోతే అంత ధనం ఎలా కూడగట్టారు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం మళ్లీ అబద్ధపు హామీలతో చంద్రబాబు మీ వద్దకు వస్తున్నారని మళ్లీ తిప్పి కొట్టాలని అన్నారు. నేరుగా మహిళల ఖాతాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా జమ చేస్తుంటే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది అని ఆందోళన చెందిన చంద్రబాబు జగన్ పథకాలనే పేర్లు మార్చి మేనిఫెస్టోగా ప్రకటించారని ఎద్దేవా చేసారు. ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు మాత్రం నిను నమ్మం బాబు అంటున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో ఇప్పటి కంటే అత్యధిక మెజారిటీతో వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపీటీసీ లు కొండప్ప సురేఖ, తిర్రి గుణ, ఆది బలిజ సంఘం అధ్యక్షుడు గుంటు వల్లభరావు, వైసీపీ గ్రామ అధ్యక్షుడు లండ శ్రీను, సచివాలయ కన్వీనర్ సండుపల్లి మోహన్, సిహెచ్. ధనుంజయ, ఎంపీటీసీ ప్రతినిధి తిర్రి రాజారావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ధరఖాస్తులాహ్వానం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట కేంద్రంగా స్వచ్ఛంద సేవ సంస్థఅయిన శ్రీశయన చైతన్యదీపిక ఈ ఏడాది కూడా శ్రీశయన సామాజికవర్గ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస మండలాలతో పాటు ఇచ్ఛాపురం, కాశీబుగ్గ మున్సిపాలిటీలకు చెందిన శ్రీశయన సామాజికవర్గానికి చెంది ప్రభుత్వ పాఠశాలల్లో 20221-23 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో 540 నుంచి ఆపై అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించి రానున్న విజయదశమి రోజున ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30లోగా పూర్తి వివరాలతో ధరఖాస్తులను సోంపేట మెయిన్‌రోడ్డులో గల సాగర్ మెడికల్ షాపు వద్ద అందజేయాలని కోరారు. పూర్తి సమాచారం కొరకు 9493907575, 9440022665, 9985285823 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాజకీయాలకు ఆతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండలం పట్టుపురం పంచాయతీ సర్పంచ్ మెట్ట ఈశ్వరమ్మ సింహాచలంలు అన్నారు. బుధవారం మండలం లోని నీలంపేట సచివాలయం పంచాయతీల్లో అర్హులకు రెండో విడత పింఛన్లను స్థానిక మండల అభివృద్ధి అధికారి కె. ఫణీంద్రకుమార్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోను సర్పంచ్, ఎంపీటీసీ బొడ్డు చెంచులతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సచివాలయ అధికారులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పైడిశెట్టి రమేష్‌కుమార్ పూర్వ ప్రిన్సిపాల్ రజనీకుమారి, ప్రిన్సిపాల్ మోహనరావు పలు విషయాలను మాట్లాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. దీంతో పాటు లైబ్రేరియన్ చిరంజీవులు, ఒరియా లెక్చరర్ భబితకుమారి, జూనియర్ అసిస్టెంట్ జీవితలను ఘనంగా సత్కరించారు.

కాలనీవాసులకు ఎంపీపీ పలకరింత

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణ సమీపంలో జగనన్న కాలనీలో కొత్తగా ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న కాలనీవాసులను స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసుతో పాటు తహశీల్దార్ సత్యన్నారాయణ, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, గృహనిర్మాణాధికారి శివరాం అలాగే స్థానిక ఈఓ వరప్రసాదరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ అబ్బాస్‌లు బుధవారం పలకరించి కాలనీ పరిస్థితులను పరిశీలించారు. మౌళిక సదుపాయాలు గూర్చి చర్చించారు.

అండమాన్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పూడి నేతాజీ

విశాలాంధ్ర-కవిటి: అండమాన్ కలెక్టర్ వేదితారెడ్డి ని కవిటి మండల ఉపాధ్యక్షులు పూడి నేతాజీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసిశారు. నేతాజీ అండమాన్ పర్యటనలో భాగంగా అక్కడ కలెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నం శాసనసభ్యురాలు రెడ్డి శాంతి కుమార్తె వేదిత రెడ్డి ని కవిటి మండల పరిషత్ ఉపాధ్యక్షులు పూడి నేతాజీ తో పాటు ప్రముఖ న్యాయవాది వజ్జ గోపి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెందాళం విజయకృష్ణ, సనపల కామేశ్వర రావు, సంగారు త్రినాథ్, అండమాన్ లో స్థిరపడిన ఉద్దానం వాసులు పాల్గొన్నారు.